## భూ రీ సర్వే సక్రమంగా చేసుకోవాలి

**జాయింట్ కలెక్టర్ విక్టర్**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో భూ రీ సర్వే లో భాగంగా జెయింట్ కలెక్టర్ వచ్చి గొల్లపల్లి లో ప్రతి ఒక్కసర్వే నంబర్ ఉన్న వారు రీ సర్వే చేపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విక్టర్, తాసిల్దార్ హేమలత, ఏడి సర్ సర్వేయర్ మౌనిక, ఆర్ ఐ నరేష్ జిపిఓ శ్రీకాంత్ గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుసూదన్, వర్డ్ సభ్యులు మర్రి ప్రభాకర్, రెడ్డి మల్లేష్, గ్రామ కమిటి అధ్యక్షుడు పెద్ద మల్లేష్, గ్రామ ప్రజలు నరేష్, లింగం, ధర్మపురీ రాజయ్య బాలరాజు, భూమయ్య, రాజనర్సు, శంకరయ్య, సాయిలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎఫ్ఎస్ యాప్తో సులభంగా ఎరువులు

**రాజముద్ర న్యూస్, గుడిహత్నూర్:** ఎఫ్ఎఫ్ఎస్ యాప్తో రైతులు సులభంగా ఎరువులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ అన్నారు. బుధవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో యాప్పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామం నుంచి ఎంపిక చేసిన వాలంటీర్లకు యాప్ పనితీరుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులు యాప్లో ఆధార్ నంబర్, భూమి, సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. అందుబాటులో ఉన్న సబ్సిడీ ఎరువుల డీలర్ను ఎంపిక చేసుకుని బుకింగ్ చేసుకోవచ్చన్నారు. బుక్ చేసుకున్న 48 గంటల్లోగా ఎరువులను పొందవచ్చని చెప్పారు. డీలర్ వద్దకు వెళ్లేటప్పుడు బుక్ చేసుకున్న క్యూఆర్ కోడ్ను చూపించాలని, డీలర్ ఈ-పాస్ మిషన్లో స్కాన్ చేసి ఎరువులను అందజేస్తారని తెలిపారు. రైతులు ఈ యాప్ను సద్వినియోగం చేసుకుని ఎరువులను సరైన మోతాదులో పొందాలని కోరారు. యాప్ వినియోగంపై సందేహాలు ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 21 రెవెన్యూ గ్రామాల వాలంటీర్లు, ఏఈఓలు రమ్య, సుకీర్తి, పద్మాక్షి, సాయిరాం, వెంకట్, రైతులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**రాజముద్ర న్యూస్, తాండూర్:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకునేలా చూడాలని మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ అన్నారు. బుధవారం మాదారం అంగన్వాడీ కేంద్రం-3లో అంగన్వాడీ టీచర్ మీన ఆధ్వర్యంలో మదర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ మదర్స్ కమిటీ సభ్యుల సమక్షంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహణ, టీచర్ పనితీరు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రతినెలా మదర్స్ కమిటీ సభ్యులు క్రమం తప్పకుండా సమావేశమై అంగన్వాడీ కేంద్రం పనితీరును సమీక్షించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో గానీ, లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకుల్లోగానీ ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా లబ్ధిదారులకు చేరేలా చూడడంతో పాటు గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు సర్పంచ్ పౌష్టికాహార సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు పి.సౌమ్య, గొర్లపల్లి బానేష్, కె.రవికుమార్ యాదవ్, జి.లక్షి , ఆశా కార్యకర్త తాండూరి మల్లీశ్వరి, మదర్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**రాజముద్ర న్యూస్, మంచిర్యాల:** జిల్లాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం భీమారం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేటాయించిన భూ సమస్యపై విచారణ నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్లో ఉన్న సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత రికార్డుల ఆధారంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోటపల్లి మండల తహశీల్దార్తో కలిసి మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్ను తనిఖీ చేశారు. పెండింగ్లో ఉన్న పీడీఎస్ బియ్యం సరఫరా వివరాలను పరిశీలించారు. రేషన్ డీలర్లకు బియ్యం సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పీడీఎస్ బియ్యం సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన మేరకు సకాలంలో సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** జిల్లాలో రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. వర్షాకాల సాగు నేపథ్యంలో బుధవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని యూరియా గోదామం, యూరియా బుకింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ వివరాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతుల నమోదు, బుకింగ్, పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుకింగ్ సమయంలో రైతులకు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలని, యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. డిజిటల్ బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. దీంతో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ఎరువులను ఎంఆర్పీకే విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా నిల్వ చేయడం, ఎరువులను పక్కదారి పట్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు తమకు అవసరమైన మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని, ఒకేసారి అధిక మొత్తంలో నిల్వ చేసుకోవద్దని సూచించారు. సహకార సంఘాల ద్వారా ప్రతి రైతుకు సకాలంలో యూరియా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. కలెక్టర్ వెంట పీఏసీఎస్ సిబ్బంది పూర్ణచందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీఎంలో గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

- **ఎన్నికల నిర్వహణకు సానుకూలంగా స్పందించిన అడిషనల్ లేబర్ కమిషనర్**



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** కాగజ్నగర్ ఎస్పీఎం (సిర్పూర్ పేపర్ మిల్లు)లో గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఎన్నికల్లో కార్మికుల మద్దతుతో విజయం సాధించిన సంఘంతోనే యాజమాన్యం అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు జె.మల్లికార్జున్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కూరపాటి రమేష్, వంగూరి రాములు అడిషనల్ లేబర్ కమిషనర్ బి.గంగాధర్ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్పీఎంలో గుర్తింపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టులో లేబర్ డిపార్ట్మెంట్ వాదనలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. లేబర్ డిపార్ట్మెంట్ తరఫున వాదనలను వెంటనే హైకోర్టుకు సమర్పించి, ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేయాలని అడిషనల్ లేబర్ కమిషనర్ను కోరారు. వారి విజ్ఞప్తిపై అడిషనల్ లేబర్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. లేబర్ డిపార్ట్మెంట్ తరఫున వాదనలను వెంటనే హైకోర్టుకు సమర్పించనున్నట్లు నాయకులకు హామీ ఇచ్చారు. ఎస్పీఎంలో కార్మికుల హక్కులు, ప్రయోజనాలను కాపాడేందుకు గుర్తింపు సంఘం ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని సీఐటీయూ నాయకులు కోరారు. కార్మికుల అభిప్రాయానికి అనుగుణంగా గుర్తింపు సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాలని వారు స్పష్టం చేశారు.

# రేషన్ డీలర్పై చర్యలు తీసుకోవాలి



**రాజముద్ర న్యూస్, తాండూర్:** మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో గల రేషన్ షాపు నం.6 డీలర్పై చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు కోరారు. బుధవారం తహశీల్దార్ జ్యోత్స్నకు ఫిర్యాదు చేశారు. రేషన్ షాపు నిర్వహణలో నిబంధనలు పాటించడం లేదని, లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రేషన్ డీలర్ లక్ష్మి షాపులో ఉండకుండా ఆమె భర్త రామలింగం బియ్యం పంపిణీ చేస్తూ షాపు వ్యవహారాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. రేషన్ బియ్యాన్ని తీసుకోకుండా తనకే విక్రయించాలని లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు అంగీకరించని వారిని నాలుగైదు రోజుల పాటు షాపు చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడటంతో పాటు చులకనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము నాలుగు రోజులుగా షాపుకు వెళ్తున్నా బియ్యం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి రేషన్ డీలర్పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని పలు రేషన్ షాపుల్లో డీలర్లు సమయపాలన పాటించడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులు మండల వ్యాప్తంగా రేషన్ షాపులపై తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గుడిగంటి విజయ్, ఆదరి సతీష్, హాబీబ్ ఖాన్, గోగర్ల రాజకుమార్, ధర్మాజీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి

- **హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఘనంగా ర్యాలీ**





**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని దేశభక్తి నినాదాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కోడె రమేశ్ మాట్లాడుతూ యువతే దేశానికి బలమని, యువతే భారత భవిష్యత్తు అని అన్నారు. దేశభక్తి కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని సూచించారు. ఒక్క యువకుడి అడుగు వందల మందికి స్ఫూర్తిగా నిలవాలని, జాతీయ జెండా తిరంగాను చేతబట్టి దేశ ఐక్యతను చాటుతూ దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలనే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత, సార్వభౌమత్వం, దేశభక్తి భావాలను చాటాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ జెండా పట్ల గౌరవాన్ని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, సర్పంచ్ పొన్నాల మహేష్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి జమున, ఉపాధ్యక్షులు నర్సింలు, ఎలేందర్, కార్యదర్శి స్వామి, కోశాధికారి నాగరాజుగౌడ్, శక్తి కేంద్రాల ఇన్చార్జులు సర్వోత్తమ్, ఆంజనేయులు, దేవేందర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు

- **ఇన్స్పైర్ మనక్ అవార్డుకు చంద్రకళ ఎంపిక**





**రాజముద్ర న్యూస్, తాండూర్:** సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందని మాదారం-3 ఇంక్లెన్ గ్రామ సర్పంచ్ చందనాల రవికుమార్ అన్నారు. ఎంపీయూపీఎస్ మాదారం-3 పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన షూస్ను బుధవారం ఎస్ఎంసీ చైర్మన్ గంధం లక్షి , ఉప సర్పంచ్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్బుక్స్, యూనిఫాంలు అందిస్తుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి షూస్ కూడా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భవిష్యత్తులో మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఇన్స్పైర్ మనక్ అవార్డుకు చంద్రకళ ఎంపిక..

పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చింతపూర్ చంద్రకళ 2025-26 విద్యా సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక ఇన్స్పైర్ మనక్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన చంద్రకళను సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

